ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు


TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | శుక్రవారం | 03.07.2026 | సంపుటి : 2 | సంచిక : 02 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

### ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం

కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు

బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు

గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియా తో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు.



03

## తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ఆసక్తి

### వ్యవసాయ సంచాలకునితో బృందం భేటీ

పలు పంటల విధానంపై వివరించిన గోపి



హైదరాబాద్, జూలై 2 : ఇండోనేషియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు భారత పర్యటనలో భాగంగా ఇండోనేషియా దేశానికి చెందిన నలుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని

-మిగతా 2 లో..



## బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని మోసం

### అమాయకులకు డబ్బు ఆశ చూపి దోపిడీ

పోలీసుల వేషంలో బెదరించి లూటీలు

సత్తుపల్లి గంగారాం డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు

12 మంది నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరి కోసం గాలింపు

ఖమ్మం, జూలై 2 : బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. అనంతరం పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో జరిగిన సంచలన డెకాయిటీ కేసును పోలీసులు విజయవంతంగా

-మిగతా 2 లో..

## రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత



### కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం

తెలంగాణ భవన్ వద్ద హరీష్ అరెస్ట్

గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధం అంటూ మంత్రుల బైఠాయింపు

రాష్ట్ర అప్పులపై, గురుకుల టెండర్లపై చర్చలకు సవాళ్లు విసిరిన మంత్రులు గోల్ కొడదామనుకొని.. చర్చకు రాకుండా సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. “భారాస ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిందని ఒకరోజు.. రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిందని మరోరోజు మాట్లాడిన జూపల్లి కృష్ణారావు.. తెలంగాణ భవన్‌లో చర్చకు వస్తానని మాట తప్పినందుకు.. మంత్రి పదవికి రాజీనామా చేయాలి” అని డిమాండ్ చేశారు. అప్పులపై గతంలోనే లెక్కలతో సహా వివరించినా.. ముఖ్యమంత్రి, మంత్రులు తప్పుడు ప్రచారంచేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 03



## మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

- రూ.7,345కోట్లతో మొదటి దశ పనులకు గ్రీన్ సిగ్నల్
- వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్
- ఇక స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లకు కూడా మధ్యాహ్న భోజనం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు
- గిడ్డంగులు, నవోదయ విద్యాలయాలకు పలుచోట్ల భూ కేటాయింపులు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, జూలై 2 : కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల ఆభిప్రాయాలకు విరుద్దంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినేట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై

-మిగతా 2 లో..



## గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

- స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి
- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

03



## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం

04



## ఉప్పల్ భూపోరాటానికి కవిత పిలుపు

### ఎక్కడికక్కడే టిఆర్ఎస్ కార్యకర్తల అరెస్ట్

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేసారు. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో భూపోరాటానికి పిలుపునిచ్చారు. 03

## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్

అసత్యాలతో ప్రజలను మభ్యే పెట్టే కార్యక్రమం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు సమాధానం ఇచ్చే తెగువ కాంగ్రెస్ సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సవాల్ చేశారని.. ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.



02

హైదరాబాద్, జులై 2 : అప్పుల విషయంలో దమ్ముంటే రావాలని సీఎం సవాల్ చేశారని తెలిపారు. పలు విషయాలపై చర్చించడానికి తాము సిద్ధమని రేవంత్‌రెడ్డికి చెప్పామని.. ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సవాల్ విరిసిన

-మిగతా 2 లో..



## సిఎం రేవంత్ రెడ్డితో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

### సీతక్క నాయకత్వంలో పలు అంశాలపై చర్చ

ఏజెన్సీలో అదనగంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లకు వినతి

హైదరాబాద్, జులై 2 : సచివాలయంలో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివాసి ,గిరిజన శాసన సభ్యులు కలిశారున. పలు అంశాలపైన సీఎంకి వినతి పత్రాలు అందించారు. ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనం గా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకం అమలు చేయాలని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్గ్రేడ్ చేయాలన్నారు. అలాగే ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్ ఏ జారే ఆదినారాయణ,పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు,ఇల్లందు ఎంఎల్ ఏ కోరం కనకయ్య,భద్రాచలం ఎంఎల్ఏ తెల్లం వెంకట్ రావు, ఖానాపూర్ ఎంఎల్ ఏ వెడ్మ బొజ్జు ఉన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అడ్లూరి లక్ష్మణ్,అజారు- ద్దీన్ కూడా ఉన్నారు.

## ఏసీబీ వలలో 'అవినీతి' తిమింగలం

### కళ్లు చెదిరేలా ఆస్తులు

డీఎస్పీ అక్రమాస్తుల విలువ 200 కోట్ల పైమాటే

డీఎస్పీ భీమిరెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు.. అరెస్ట్



హైదరాబాద్, జూలై 2: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసింది. పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో పనిచేస్తున్న భీమ్‌రెడ్డి.. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గురువారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగించారు. నార్సింగిలో ఆయన ఇల్లు సహా రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కళ్లుచెదిరే రీతిలో ఆస్తులను ఏసీబీ గుర్తించింది. విల్లా, ఇళ్లు, ఫ్లాట్లు, కమర్షియల్ స్పేస్‌లు, ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ భీమ్‌రెడ్డికి వ్యవసాయ భూములు ఉన్నట్లు ఏసీబీ

-మిగతా 2 లో..

# బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని మోసం

(మొదటిపేజీ తరువాయి)

ఛేదించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలోని సత్తుపల్లి పోలీస్ ప్రత్యేక బృందాలు ఈ కేసులో ముమ్మర దర్యాప్తు జరిపి మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఈ దోపిడీ ముఠాలో భాగస్వాములు కావడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. అరెస్టైన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ కేసులో 14 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఓ కానిస్టేబుల్, ఆర్ఎస్సై కూడా ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గంగారం శివారులో నిర్వహిస్తున్న తనిఖీల్లో 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం తెలిసింది. దర్యాప్తులో ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠా సూత్రధారిగా గుర్తించారు. అతడు మరో 13 మందితో కలిసి వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు. రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులు.. నకిలీ పోలీసులతో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యేవారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్సై బైరా కేశవరావు ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, మూడు కార్లు, ఓ స్కూటీ, సెల్‌ఫోన్లు, పోలీసు దుస్తులు, బేడీలు, డమ్మీ కరెన్సీ నోట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. కేసును ఛేదించిన సత్తుపల్లి సీఐ టి. శ్రీహరి ఆధ్వర్యంలోని పోలీసు బృందాన్ని ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు బ్లాక్‌మనీ మార్పిడి పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్, భారీ లాభాల ఆఫర్లను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలపాలని ఇవ్వాలని ఏసీపీ వసుంధర యాదవ్ సూచించారు.

# ఏసీబీ వలలో 'అవినీతి' తిమింగలం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించింది. ఆయన ఇంట్లో భారీ స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, సుమారు రూ.43.06 లక్షల నగదు, దాదాపు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, 23 విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంబాగ్‌లోని వెస్పెల్లా మెడోస్‌లో విల్లా, టెలికాంనగర్‌లో జీప్లస్2 పెంట్‌హౌస్‌తో ఇల్లు, ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో ఒక ఫ్లాట్, మణికొండలో 500 గజాల +o5 కమర్షియల్ కాంప్లెక్స్‌లో వాటా, 3,000 చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్‌లను గుర్తించారు. తెల్లాపూర్‌లో రెండు ఫ్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 3.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. కర్ణాటకలో పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. వేర్వేరు చోట్ల దాదాపు 45 ఎకరాలు ఉన్నట్లు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్ కామినేని ఆస్పత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ సమీపంలో 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో మరో 200 గజాల ప్లాట్, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో 1,000 గజాల స్థలం, 2 ఎకరాల వ్యవసాయ భూమి, శ్రీరాఘవేంద్ర రాక్‌శాండ్ మినరల్స్‌లో రూ.75 లక్షల పెట్టుబడి, వికారాబాద్ జిల్లాలో 4.20 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తించారు. డీఎస్పీ బ్యాంకు ఖాతాల్లో రూ.19.91 లక్షల నిల్వలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు.

# బార్బీక్యూనేషన్ రెస్టారెంట్‌లో కంపు

## కుళ్లిన ఆహారా పదార్ధాలు స్వాధీనం

### గతంలో హెచ్చరించినా అదే తంతు

### చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 2 :** హైదరాబాద్ ఉప్పరపల్లిలోని బార్బిక్యూనేషన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలతోపాటు, పాడైపోయిన చికెన్, మటన్, ఫిష్, ఐస్‌క్రీమ్స్, పండ్లు వంటి పదార్థాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసినట్లు గుర్తించారు. పాడైన మాంసంపై స్టిక్కర్లను మార్చి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు. గతంలో ఇలానే తనిఖీలు చేసినప్పుడు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలగా.. తీరు మార్చుకోవాలని సూచించినట్లు చెప్పారు. అయినా రెస్టరంట్ యాజమాన్యం తీరు మారలేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీల్లో కుళ్లిపోయిన, గడువు ముగిసిన చికెన్, మటన్, చేపలు, ప్రాన్స్, కేక్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏ ఐటమ్ చెక్ చేసినా పరిస్థితి అలాగే ఉండటంతో అధికారులు షాకయ్యారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలపై ఉన్న ఎక్స్‌పైరీ తేదీలను మార్చి, కొత్త తేదీలు ముద్రించి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేలా ఆహార పదార్థాలను నిల్వ చేసి వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైందని ఫుడ్ సేఫ్టీ అధికారి సౌమ్య తెలిపారు. ఇలాంటి ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. గతంలో కూడా ఇదే రెస్టారెంట్‌పై తనిఖీలు నిర్వహించినప్పటికీ యాజమాన్యం తీరులో మార్పు కనిపించలేదని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలను ధ్వంసం చేసి, రెస్టారెంట్ యాజమాన్యంపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ సందర్భంగా చెప్పారు.

# బీఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే

- చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నాం
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. అది నిజమా కాదా చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి, ఎలా తీరుస్తారో ఎందుకు చెప్పలేదన్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని



సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్-ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు , నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి గాను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం భూములను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించనున్నారు.

రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అలాగే, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంత్రివర్గం తీర్మానించింది. గోదాములు, విద్యాలయాలు, సంస్థ ల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం దీనిపై సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయపడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపీని మర్యాదపూర్వకంగా కలిసింది. సమావేశంలో తెలంగాణ వ్యవసాయరంగం పురోగతి, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయంలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంపిణీపై వివరించగా, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు విత్తన ధృవీకరణ, నాణ్యత నియంత్రణ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు భరోసా, రైతు బీమా, ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్య నిర్వహణ, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ డ్రోన్ల వినియోగం, జాతీయ ఆహార భద్రతా మిషన్, పప్పుధాన్యాల అభివృద్ధి కార్యక్రమం, నూనెగింజల ఉత్పత్తి ప్రోత్సాహక పథకం, డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రి స్టాక్ (ఫార్మర్ రిజిస్ట్రీ), యూరియా బుకింగ్ యాప్, ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్, రైతు వేదికలు, రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ వంటి వినూత్న కార్యక్రమాల అమలు, వాటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న రైతు కేంద్రిత, పారదర్శక, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను ఇండోనేషియా ప్రతినిధి బృందం అభినందించింది. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నటువంటి రైతు భరోసా రైతు బీమా యూరియా యాప్ సహజ వ్యవసాయం వంటి పథకాలపై ప్రశంసించారు ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆహార భద్రత, రైతుల సామర్థ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి అంశాలపై ఇరు పక్షాలు విస్తృతంగా చర్చించాయి. ఈ సమావేశంలో ఇండోనేషియా ప్రతినిధి బృందం తరఫున ప్రతినిధి బృందం సమన్వయకర్త, ఇండోనేషియా ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిశోధన / అభివృద్ధి డైరెక్టరేట్ జనరల్ కార్యదర్శి ప్రొఫెసర్ జునైది ఖోటిబ్, ఇండోనేషియా డిఫెన్స్ యూనివర్సిటీకి చెందిన డా. పుంగ్కి ధర్మ సపుత్ర, ఇండోనేషియా స్టేట్ సెక్రటేరియట్కు చెందిన మస్జితా, అలాగే న్యూఢిల్లీలోని ఇండోనేషియా రాయబార కార్యాలయం ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అటాషే ప్రొఫెసర్ ఫువాద్ పాల్గొన్నారు.



# సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పారిపోయారని సెటైర్లు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితే జూపల్లి వస్తున్నారని తాము అనుకున్నామని.. కానీ పనికి మాలిన డైలాగ్‌లను జూపల్లి కొడుతున్నారని వ్యగ్యంగా అన్నారు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే.. ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని ప్రశ్నించారు. గన్‌పార్కు రమ్మన్నారని.. వెళ్తుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాల్ విసరాలని నిలదీశారు. అసెంబ్లీలో తనకు గంట సమయం ఇవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

# పంజాబ్ ఎన్నికల వేళ.. కమిటీలు వేసిన కాంగ్రెస్


- మనీశ్ తివారిని దూరం పెట్టిన పార్టీ
- ఏది రాసిపెట్టి ఉంటే అదే జరుగుతుందని నిర్వేదం

**న్యూఢిల్లీ, జూలై 2 :** వచ్చే ఏడాది ఎన్నికలకు సిద్ధం అవుతున్న పంజాబ్ కాంగ్రెస్ ఈ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల కమిటీల బాధ్యతలను పలువురు నేతలకు అప్పగించింది. అయితే, సీనియర్ నేత, ఎంపీ మనీశ్ తివారీకి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడం రాష్ట్రంలో చర్చకు దారి తీసింది. ఈ విషయంపై మనీశ్ తివారీ ఎక్స్ వేదికగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'అసలు నైపుణ్యాలు ఉండటమే ఒక పెద్ద తప్పు లాగా ఉంది. జనాల అభద్రతా భావాలను తొలగించే మార్గం నాకు తెలిసుంటే బాగుండేది. కాంగ్రెస్ నాకు గత 45 ఏళ్లల్లో ఎన్నో అవకాశాలు ఇచ్చింది. నేనూ నా జీవితాన్ని పార్టీకి అంకితం చేశాను. కానీ జీవితంలో ఏది రాసిపెట్టి ఉందో అదే జరుగుతుంది' అని ఆయన ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అయితే, మనీశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న చండీగఢ్ రాష్ట్రం పరిధిలోకి రాకపోవడంతో ఆయనకు ఎన్నికల బృందంలో చోటు దక్కలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. తివారీ గతంలో లూథియానా, ఆనంద్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. ఇక గురువారం కాంగ్రెస్ పలు ఎన్నికల కమిటీలకు ఛైర్‌పర్సన్‌లను ప్రకటించింది. ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను కూడా నియమించింది. తివారీకి మాత్రం ఎలాంటి ఎన్నికల బాధ్యతలు దక్కలేదు. ఇక, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమరీందర్ సింగ్‌ను కొనసాగించడంపై చరణజీత్ సింగ్ ఛన్నీ వంటి సీనియర్ నేతలు పలువురు అసంతృప్తితో ఉన్నట్టు కూడా తెలుస్తోంది. ఈసారి ఎన్నికల ప్రచార కమిటీకి చరణ్‌జీత్ సింగ్ ఛన్నీ నేతృత్వం వహిస్తున్నారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ కోఆర్డినేషన్ కమిటీకి విజయ్ ఇందర్ సింఘ్లా నాయకత్వం వహిస్తున్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

- తుది దశలో స్థలాల సేకరణ
- దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల నిర్మాణం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూలై 2 :** క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం నాడు మంత్రి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రతి పేద కుటుంబానికి ఇల్లు' అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5500 వరకు ఇళ్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు




ఇస్తామని మంత్రి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలను నగరాల నుంచి 30 కిలోమీటర్ల దూరంలోకి తరలించి ఇళ్లు కట్టే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి జీవనాధారాలకు దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు అందించడం ప్రభుత్వ కట్టుబాటు అని మంత్రి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పందన రాలేదని గుర్తుచేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రయోజనం లేదనే ఆలోచనతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ మాత్రం అదే నిధులను పేదల గూడు కోసం వినియోగిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కర్ణాటకలో ఘోర ప్రమాదం

- క్వారీలో కార్మికులపై దొర్లిపడ్డ బండరాయి
- ఏడుగురు కార్మికుల దుర్మరణం

**బెంగళూరు,జూలై2 :** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఏడుగురు కార్మికులు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఓ స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బిహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

- కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం
- తెలంగాణ భవన్ వద్ద హరీష్ తదితరుల అరెస్ట్
- గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధం అంటూ మంత్రుల బైఠాయింపు



**హైదరాబాద్, జూలై 2 :** రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో పాలిటిక్స్ హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో పక్కాగా వివరిస్తాననిస్పష్టం చేశారు. డేట్ అండ్ టైం ప్లేస్ ఏదైనా సరే.. 'వరంగల్ ప్రెస్‌క్లబ్‌లోనా? అశోక్‌నగర్‌లోనా? అసెంబ్లీలోనా? వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనా వైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని చాలెంజ్ చేశారు. కాగా, కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు గురువారం 11 గంటలకు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఇదిలావుంటే గురుకులాల్లో టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చల్లో ట్విస్టు చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు గన్‌పార్క్‌కు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు హరీశ్ రావు సిద్ధమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్ బయలు దేరారు. గురుకులాలపై చర్చకు మేము ప్రెస్‌క్లబ్ రమ్మంటే మంత్రులు గన్‌పార్క్ రమ్మన్నారు. మాకు ఎలాంటి భేషజాలు లేవు. మీరు రమ్మన్నారు మేము వస్తున్నామని తెలిపారు. చర్చకు ఎక్కడికైనా మేము సిద్ధమని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు వద్దు కూర్చొని మాట్లాడుకుందామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే..కేటీఆర్ చర్చించేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.కాగా, గన్‌పార్క్‌కు బయలు దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం. ఎందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చలను అడ్డుకుంటుందని హరీశ్ రావు మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కిందపడిపోయారు. ఆ వెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌తో పాటు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోయిందంటూ దుయ్యబట్టారు. అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గన్‌పార్క్‌కు ముగ్గురు మంత్రులూ చేరుకుని.. అమరవీరుల స్థూపం దగ్గర కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గన్‌పార్క్‌కు వచ్చారు. తెలంగాణ మంత్రులు, మాజీ మంత్రుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో గన్‌పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. అటు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ దగ్గర కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం
- కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు
- బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు

**హైదరాబాద్, జూలై 2 :** గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## నకిలీ వీసాలతో మస్కట్‌కు వెళ్లే ప్రయత్నం

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 20మంది మహిళల అరెస్ట్**

**హైదరాబాద్, జులై 2 :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 20 మంది మహిళా ప్రయాణికులను ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. మస్కట్‌కు వెళ్లేందుకు వచ్చిన వీరి వద్ద నకిలీ వీసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గురువారం 20 మంది మహిళలు ఎయిర్‌పోర్టుకు వచ్చారు. వీరంతా ఒమాన్ ఎయిర్‌లైన్స్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ 20 మంది మహిళలను ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు చెకింగ్ చేశారు. దీంతో అసలు విషయం బయటపడింది. మహిళల దగ్గర నకిలీ వీసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే 20 మందిని ఇమ్మిగ్రేషన్ ఆధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఎయిర్‌పోర్ట్ ఔట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. దీంతో 20 మంది మహిళా ప్రయాణికులను ఔట్‌పోస్ట్ పోలీసులు విచారిస్తున్నారు. నకిలీ వీసాలు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరు ఇచ్చారు అనేదానిపై ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారాని కి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## 14 సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ

**కొత్తగా పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల నియామకం**

**హైదరాబాద్, జూలై 2 :** కరీంనగర్, వరంగల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా సంఘాల పాత పాలక వర్గాల స్థానంలో కొత్త పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన కమిటీల పదవీకాలం ఆరు నెలలు లేదా సహకార సంఘాల తదుపరి ఎన్నికలు జరిగే వరకూ కొనసాగుతుందని స్పష్టం చేసింది. సంఘాల పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా, వారి సేవలకు ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. పీఏసీఎస్‌ల పూర్తి స్థాయి పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నూతన పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలు బాధ్యతల్లో ఉంటాయి. ఈ సంఘాలలో గత కొంతకాలంగా చోటుచేసుకుంటున్న తీవ్ర పరిపాలనా లోపాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ రుణాల వసూళ్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడం, గడువు ముగిసినా బకాయిలు చెల్లించని డిఫాల్టర్లపై పాత కమిటీలు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోకపోవడం వంటి అంశాలపై సహకార శాఖకు నివేదికలు అందాయి. పాత పాలక వర్గాల నిర్లక్ష్యం కారణంగా సంఘాల ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో పాటు సంస్థాగతంగా తీవ్ర లోపాలు తలెత్తాయని నివేదికలో తేలింది. ఈ నేపథ్యంలోనే సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి, పారదర్శకతను పెంచడానికి వీలుగా పాత కమిటీలను రద్దు చేస్తూ కొత్త కమిటీలను నియమించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఈ 14 సంఘాల నూతన పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలు బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి.

## మంత్రులకు చర్చించే దమ్ము ఉంది

- అందుకే ధైర్యంగా గన్‌పార్క్ వద్దకు వచ్చారు
- బిఆర్ఎస్ నేతలే చర్చకు రాలకుండా పారిపోయారు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శలు



**హైదరాబాద్, జూలై 2 :** కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందని, అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా, పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద ఆయన మాట్లాడారు. తప్పు చేయలేదనే నమ్మకంతోనే ప్రజల ముందుకు వచ్చి మంత్రులు చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్‌రావు అండ్ కో చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకొచ్చారని దానం నాగేందర్ పేర్కొన్నారు. కాగా, గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహ్మద్ అజారుద్దీన్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పలు అంశాలపై చర్చించడానికి రెడీ అని చెప్పారు. అయితే, ఈరోజు కాంగ్రెస్ మంత్రులు మొదటగా అసెంబ్లీకి బయలుదేరారు. అనంతరం గన్‌పార్క్‌కు చేరుకుని తమ సన్నద్ధతను ప్రకటించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు.

## గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

- స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి
- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్,జూలై2 :** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు.



## బీఆర్ఎస్ గూండాగిరీకి ప్రభుత్వం భయపడదు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్ గూండాగిరీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ బయటపెట్టారని చెప్పారు. అధికారంలోకి వస్తామనే భ్రమతో బీఆర్ఎస్ నేతలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారు. టెండర్ విలువ కంటే ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుంది? ఇలాగే ప్రవర్తిస్తే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఆ పార్టీ సవాల్‌ను స్వీకరించి మంత్రులు చర్చలకు వెళ్లారు. బీఆర్ఎస్ నేతలే రాకుండా పారిపోయారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమే'అని పొంగులేటి అన్నారు.

## మెడలో బంగారం లాక్కుని.. బావిలో తోసేసి పరార్

**కరీంనగర్, జూలై 2 :** కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో అమానుషమైన ఘటన వెలుగుచూసింది. పని ఇప్పిస్తానని నమ్మబలికిన ఒక దుండగుడు ఓ మహిళను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి, ఆమె మెడలోని అర తులం బంగారాన్ని లాక్కున్నాడు. అంతటితో ఆగకుండా తన గుట్టు బయటపడుతుందని భావించి.. ఎలాంటి ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఆమెను పక్కనే ఉన్న ఒక వ్యవసాయ బావిలోకి తోసేసి అక్కడ నుంచి పరారయ్యాడు. బావిలో పడిపోయిన సదరు మహిళ సుమారు 24 గంటల పాటు మృత్యువుతో పోరాడింది. ఉదయం బావి వద్దకు వెళ్లిన యజమాని లోపల నుంచి శబ్దాలు రావడంతో గమనించగా, మహిళ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ కనిపించింది.




## ఉప్పల్ భూపోరాటానికి కవిత పిలుపు

**ఎక్కడికక్కడే టిఆర్ఎస్ కార్యకర్తల అరెస్ట్**


**హైదరాబాద్, జులై 2 :** రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేసారు. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో భూపోరాటానికి పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోరాటం కొనసాగనుంది. ఈ మేరకు ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, భూపోరాటానికి వెళ్తారనే సమాచారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. దీంతో ముందస్తు అరెస్టులను ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. మరోవైపు, ఈరోజు ఉదయం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో భూపోరాటం జరిగే ప్రాంతానికి కల్వకుంట్ల కవిత చేరుకోనున్నారు. దీంతో ఆ ప్రాంతంలో మొత్తం ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం

- మాజీ డిజిపిలకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల తొలగింపు
- అలాగే భారీగా భద్రత కూడా తగ్గిస్తూ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 2 :** తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ డీజీపీలతో పాటు ప్రస్తుతం కీలక పోస్టులలో ఉన్న పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో మాజీ పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగించనున్నారు. 20 మంది మాజీ పోలీస్ ఉన్నతాధికారులతోపాటు ప్రస్తుత అధికారులకు బుల్లెట్ వాహనాలు తీసివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మ, పూర్ణచందర్రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటి నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా. ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్ మొదలైన అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధికారులతో పాటు ప్రస్తుత అధికారులకు కూడా ఈ నిర్ణయం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ లకు బులెట్ ప్రూఫ్ వాహనాలను తీసివేశారు. మాజీ డీజీపీలకు ఉన్న ఎస్కార్ట్ వాహనాలను సైతం తీసివేసింది పోలీస్ శాఖ. పలువురు రాజకీయ నేతలతో పాటు పోలీసు అధికారులకు ఉన్న గన్ మెన్‌ల సంఖ్య తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చాలావరకు వన్ ప్లస్ వన్ గన్ మెన్ లకే పరిమితం చేసింది. నక్సల్స్ ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదా కానుంది.

# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!




**తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు.**

ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది.

అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఒక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట.

దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు

**దశలవారీగా తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం**
**యూజర్ నేమ్ ఉన్నా ఫోన్ నంబర్ తప్పనిసరి**
**కేంద్రం అభ్యంతరాలకు వాట్సాప్ సమాధానం**




**న్యూఢిల్లీ, జూలై 2 :** వాట్సాప్‌లో ప్రవేశపెట్టబోతున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని, వినియోగదారులు తమకు నచ్చిన యూజర్ నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌ను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్‌తో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా కొత్త వ్యక్తులు, గ్రూపులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఫీచర్‌తో గోప్యత, భద్రత, నకిలీ ఖాతాలు, మోసాలు వంటి అంశాలపై వస్తున్న సందేహాలకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సృష్టించాల్సిన అవసరం లేదని వాట్సాప్ తెలిపింది. ఇది పూర్తిగా వారి ఇష్టమని పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లు ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేయబడతాయని వాట్సాప్ తెలిపింది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెరిఫైడ్ ఖాతాలకు సంబంధించిన పేర్లు, వాటి వేరియేషన్లు కూడా దుర్వినియోగానికి గురి కాకుండా రక్షిస్తామని పేర్కొంది. ఒకవేళ సాధారణ పేరు ఇప్పటికే మరొకరు తీసుకున్నట్లయితే, ప్రత్యామ్నాయ యూజర్–నేమ్‌లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. తన యూజర్‌నేమ్‌కు దగ్గరగా మరో వ్యక్తి పేరు సృష్టించి మోసాలకు పాల్పడితే ఎలా అనే ప్రశ్నకు వాట్సాప్ స్పందించింది. యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు చూపిస్తామని తెలిపింది. ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా చర్యలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది. యూజర్‌నేమ్‌తో పాటు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వాట్సాప్ వెల్లడించింది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే, అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు కీ కూడా తెలిసి ఉండాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ కీని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సాప్‌లో కూడా ఉపయోగించాలనుకునే వారు ముందుగా ఆ ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం కావాలంటే ఆ ఖాతాలను అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించింది. యూజర్–నేమ్ ఫీచర్ అమలుతో నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లతో పోలిన యూజర్‌నేమ్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు పూ–ర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని వాట్సాప్‌ను ఆదేశించింది. అలాగే ఫీచర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా మెసేజింగ్ సేవ ఇంకా ప్రారంభం కాలేదని స్పష్టం చేశారు. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అలాగే యూజర్‌నేమ్‌ను కచ్చితంగా తెలుసుకోవాల్సిన విధానం, యూజర్‌నేమ్ కీ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మోసాల నివారణ వంటి పలు భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు.

# అగ్రరాజ్యంలో చీకటి కోణం

**రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం**
**ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం**

**న్యూయార్క్, జూలై 2 :** అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాం÷–రతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్–డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.



## జన్మతః పిల్లల పౌరసత్వం కేసు

**సుప్రీం తీర్పుతో ఊరట చెందిన ఎన్నారైలు**

**న్యూయార్క్, జూలై 2 :** విదేశీ వలసదారుల పిల్లల పౌరసత్వాన్ని పరిరక్షిస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై భారతీయ అమెరికన్ల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని అమెరికన్లుగానే పరిగణించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీనిపై ఇండో అమెరికన్లు హర్షం చేస్తున్నారు. ఈ తీర్పు అమెరికాలోని వలస కుటుంబాలకు గొప్ప భరోసా కల్పించిందంటున్నారు. ట్రంప్ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ప్రత్యక్షంగా ప్రభావితం అయ్యేది భారత్, దక్షిణాసియా వలస కుటుంబాలేనన్నారు. అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు 'చరిత్రాత్మక విజయం' అని పలువురు ఎన్నారైలు అభివర్ణించారు. దాదాపు 52 లక్షల మంది ఇండో అమెరికన్లలో 12 లక్షల మందికి పైగా ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఎఫ్ఐఐడీఎస్ అధ్యక్షుడు ఖండేరావ్ కంద్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం 6 నుంచి 7 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఉన్నట్లు తాజా అంచనాలు పేర్కొంటున్నాయి. వారిలో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో హెచ్1బీ వీసాదారులకు ఊరట లభించనుంది.



## తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

- పోటీ నుంచి తప్పుకున్న లారెన్స్
- నటి త్రిష పోటీ చేస్తారంటూ ప్రచారం

**చెన్నై, జూలై 2 :** కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష పేరు మరోసారి తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె త్వరలో రాజకీయాల్లోకి అడుగుపెడతారని ప్రచారం సాగుతోంది. తిరుచ్చి ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున బరిలో నిలుస్తారా? అనే చర్చలు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ప్రచారానికి ప్రధాన కారణం హీరో, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తీసుకున్న నిర్ణయమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండింట్లోనూ విజయం సాధించారు. అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మొదట ఈ స్థానంలో రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆయన కూడా రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరి నిమిషంలో ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు తిరుచ్చి అభ్యర్థి ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో త్రిష పేరు తెరపైకి వచ్చింది. విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిషను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన ఉందా? ఆమె ఉపఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉందా? అనే ఊహాగానాలు తమిళ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలకే పరిమితమైంది. అయినప్పటికీ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాట ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. అధికారిక ప్రకటన వస్తేనే ఈ వార్తలకు పూర్తి స్పష్టత రానుంది. ఇక సినిమాల విషయానికి వస్తే త్రిష ప్రస్తుతం సినిమాలతోను బిజీగా ఉంది. ఇటీవల కరుప్పు చిత్రంతో పెద్ద హిట్ కొట్టిన త్రిష ఇప్పుడు చిరంజీవి విశ్వంభర సినిమాతో సందడి చేసేందుకు సిద్ధమైంది. మరోవైపు పలు చిత్రాలకి సైన్ చేసింది. ఈ వయస్సులోను త్రిష వరుస అవకాశాలు అందిపుచ్చుకోవడం , అలానే మంచి హిట్స్ దక్కించుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

## రష్యాకు భారత రక్షణ ఎగుమతులు

**నాలుగు కంపెనీలోపై యూఎస్ నిషేధం ఎత్తివేత**

**వాషింగ్టన్, జూలై 2 :** రష్యాకు రక్షణ సాంకేతికతను, యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలతో గతంలో నాలుగు భారత కంపెనీలపై విధించిన ఆంక్షలను అమెరికా తాజాగా తొలగించింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్, లోకేశ్ మెషీన్స్ సంస్థలు కూడా ఉన్నాయి. వీటితో పాటు అహ్మదాబాద్‌కు చెందిన గేలక్సీ బేరింగ్స్, ఢిల్లీకి చెందిన శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలపై ఆంక్షలను అమెరికా తొలగించింది. యుద్ధ పరికరాల తయారీకి వాడే మైక్రోఎలక్ట్రానిక్స్ పరికరాలను రష్యాకు చెందిన ఆర్టెంక్స్ కంపెనీకి సరఫరా చేసిందని ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ సంస్థపై, రక్షణ పరికరాల తయారీకి అవసరమైన యంత్రాలను సరఫరా చేసిందని లోకేశ్ మెషీన్స్ సంస్థపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇక, ఆయుధాల తయారీలో ఉపయోగించే రోలర్ బేరింగ్‌లను రష్యాకు సరఫరా చేస్తున్నారని గేలక్సీ బేరింగ్స్ సంస్థపై, రాడార్, నావిగేషన్ పరికరాలను విక్రయిస్తున్నారని శౌర్య ఏరోనాటిక్స్‌పై ఆంక్షలు విధించారు.

## అరేబియా సముద్రంలో అమెరికా హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

**ఒకరు గల్లంతు**

**వాషింగ్టన్ :** అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న అమెరికా ఎంహెచ్–60ఎస్ సీహాక్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో అందులోని సిబ్బంది ఒకరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ కూడా ధ్రువీకరించింది. "సముద్రంలో గల్లంతైన అమెరికా ఎయిర్ క్రూమెన్ కోసం మా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేపట్టాము" అని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ పై మోహరించిన హెలికాప్టర్ ఇది. సముద్ర జలాలపై హెలికాప్టర్ ల్యాండింగ్ అత్యంత ప్రమాదకరం. అత్యంత నిపుణులైన పైలట్లకు కూడా ఇది కత్తిమీద సామే. సాధారణంగా హెలికాప్టర్ పైభాగం బరువుగా ఉండటం వల్ల అవి నీటిలో తల్లకిందులయ్యే ముప్పు చాలా ఎక్కువ. జూన్‌లో హర్మూజ్ వద్ద అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ కుప్పకూలింది. దీనిలో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. అదే సమయంలో తాము అమెరికా డ్రోన్‌ను కూల్చినట్లు ఇరాన్ ప్రకటించడం ఈ ఘటనపై అనుమానాలను రేపింది.




## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం**

**శ్రీనగర్, జూలై 2 :** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమ–ర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్‌రూట్‌లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదు–పాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్, ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.



## హెచ్ఏఎల్ కాలనీలో ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టూడియో ప్రారంభం

**శేరిలింగంపల్లి,జూలై 2(జనం వార్త) :** వినియోగదారుని మన్ననలను పొందినప్పుడే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్ లు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మస్జిద్ బండ డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్.ఆర్ ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టూడియోను మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్,పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి స్టూడియోను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి కొత్త వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి దోహద పడతాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా ఇలాంటి వ్యాపార సంస్థలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. స్టూడియో యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్, సత్యనారాయణ, రవీంద్ర చారి,మెట్టు కళ్యాణ్ యాదవ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఏరులై పారుతున్న మురుగునీరు

- నాలాగా మారిన కాలనీ రోడ్లు
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరారు

**శేరిలింగంపల్లి,జూలై 02(జనం వార్త) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో మురుగునీరు ఏరులై పారుతున్న నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని మూడు రోడ్లు కలిసే జంక్షన్ పూర్తిగా మురుగునీటితో నిండిపోయి నాలాగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారు. రహదారిపై చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించడంతో స్థానిక ప్రజలు అనేక రోగాలకు గురి అవుతున్నారు. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోవడంతో కాలనీ ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ చేసుకొని శాశ్వత పరిష్కారనికి కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.




## అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ

### భూ యజమానులతో రెవెన్యూ, రైల్వే అధికారుల చర్చలు

**మేడ్చల్ :** మేడ్చల్ మండల పరిధిలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మేడ్చల్ మండలంలోని ప్రముఖ కూడలి అయిన అయోధ్య చౌరస్తా సమీపంలో అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ముమ్మర ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ మరియు రైల్వే అధికారులు వేగవంతం చేశారు. గురువారం బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో రైల్వే ల్యాండ్ అక్విజిషన్ జనరల్ కన్సల్టెంట్ రాఘవేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్, మరియు జీపీఓ లక్ష్మీకాంత్ లు పర్యటించారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాలను పరిశీలించిన అధికారులు, స్థానిక భూ యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు భూ యజమానులతో మాట్లాడుతూ, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం వల్ల స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా తొలిగిపోతాయని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చి సహకరించాలని వారు కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూములు కోల్పోతున్న యజమానులందరికీ తగిన నష్టపరిహారం సకాలంలో అందేలా చూస్తామని అధికారులు ఈ సందర్భంగా స్పష్టమైన హామీ ఇచ్చారు.



## పోలంపల్లిలో ఇందిరమ్మ గృహ ప్రవేశం

**కారేపల్లి :** కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోలంపల్లి తండాకు చెందిన గుగులోత్ జగ్గయ్య నాయక్‌కు మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణం పూర్తికావడంతో గురువారం దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి గ్రామ సర్పంచ్ హేమలత బాలాజీ చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత బాలాజీ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహాల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత నివాసం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలంపల్లి గ్రామపంచాయతీకి మంజూరైన 20 ఇందిరమ్మ గృహాల్లో ఇప్పటికే 18 గృహాల నిర్మాణం పూర్తై లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకోవడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్, ఉపసర్పంచ్ గుగులోత్ సర్వన్ నాయక్, వార్డు సభ్యులు రమేష్, సంపత్, లావణ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కళ్యాణ్, ధోని, నవీన్, లక్ష్మణ్, గుణశేఖర్, మహిళలు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నాగారం కాంగ్రెస్ అధ్యక్ష నియామకాన్ని వ్యతిరేకించిన సీనియర్ నాయకులు



- బంధుత్వానికి పట్టణ అధ్యక్ష పదవికి ముడిపెట్టారు.
- పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుండుసున్నా...

**నాగారం,జూలై 02(జనంవార్త) :** మేడ్చల్ జిల్లాలోని పలు డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను పీసీసీ నియమించిన నేపథ్యం లో, నాగారం డివిజన్ అధ్యక్షుడిగా ఎలసాని భూమయ్య యాదవ్ నియామకాన్ని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్త లను పక్కనపెట్టి,తోటకూర వజ్రేష్ యాదవ్‌కు బంధుత్వం ఉన్న కారణంగానే ఎలసాని భూమయ్యకు పదవి కట్టబెట్టారని ఆరోపించారు. దీంతో నిజాయితీగా పని చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాసోహం నర్సింగ్ రావు (చిన్న )బాలు యాదవ్,దాసరి రాంరెడ్డి,కిట్టు యాదవ్, సత్యనారాయణ యాదవ్,రవి,పంగ శ్రీహరి, గౌస్,ప్రవీణ్ యాదవ్,రామాగోని శ్రీనివాస్ గౌడ్, మనోహర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### చిన్నంరాజు సతీష్ గౌడ్ మాట్లాడుతూ.



గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో నమ్మకంగా పని చేస్తున్నాను. ప్రజాసేవ చేయాలనే తాపత్రయంతో గతంలో మూడు సార్లు పార్టీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నా అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేవలం బంధుత్వం కారణంగా ఎలసాని భూమయ్య యాదవ్‌కు డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వడం ఎంతవరకు సమంజసం మన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు.

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్.



మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ 1978 చెనరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న పటి నుండి పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేస్తున్నామన్నారు. కనీసం సీనియర్ అని గౌరవం లేకుండా ఇష్టనుసారంగా వజ్రష్ యాదవ్ వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటకూర వజ్రేష్ యాదవ్ స్వబుద్ధి బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బంధుత్వానికి పట్టణ అధ్యక్ష పదవి ముడిపెట్టిన వజ్రేష్ యాదవ్ ను డివిజన్ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. రాబోయే రోజులో వజ్రేష్ యాదవ్ ను నాగారంలో తిరుగనిజమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎమ్యునరేషన్ పత్రాల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం సరికాదు

### ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్‌పల్లి, జులై 2, (జనం వార్త) :** ఎమ్యునరేషన్ పత్రాల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్,ఫతేనగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఎమ్యునరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. ఎల్ వోలు ఇప్పటి వరకు ఎవరు తమని సంప్రదించలేదని కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని ఓటర్లు ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే కృష్ణారావు కూకట్ పల్లి జెడ్ సి కు ఫోన్ చేసి ఎస్ ఐ ఆర్ పత్రాల పంపిణీ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ )సర్వే సందర్భంగా అధికారులు ఓటర్లకు సహకరించి వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ సర్వే విషయంలో నిత్యం అధికారులు పర్యవేక్షించి ఓటర్లకు సహాయ సహకారాలు అందించి వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని సూచించారు. బి ఎల్ ఓ లతోపాటు బిఎల్ఎ లు కూడా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో భాగస్వాములు కావాలని, ఓటర్లకు సహకరించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం తోపాటు తన దృష్టికి సైతం తీసుకురావాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్ గౌడ్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

### పార్టీలో చేరిన కొత్తవాడ బీఆర్ఎస్ వార్డు సభ్యురాలు, కార్యకర్తలు

### ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం: ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**దేవరుప్పుల :** పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తాజాగా దేవరుప్పుల మండల కేంద్రం కొత్తవాడకు చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యురాలు ఉప్పుల ఉపేంద్ర, నరేష్ తో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, యువజన నాయకుడు తోటకూరి రమేష్ ఆధ్వర్యంలో మరో పది మంది యువకులు సైతం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో నమ్మకం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, సముచిత గౌరవం దక్కుతుందని ఆమె భరోసా ఇచ్చారు. అందరూ ఐకమత్యంతో పనిచేసి దేవరుప్పుల మండలంలో, పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండాను మరింత బలంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధి పట్ల చూపుతున్న చిత్తశుద్ధి తమను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ విజయానికి, బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్, మాజీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, మండల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్యా సజ్జన్, మహ్మద్ రసూల్, యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్ తదితర ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పొలంలోకి దిగిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

### కూలీలతో కలిసి వరి నాట్లు

**దేవరుప్పుల :** ప్రజల మనిషిగా, వారిలో ఒకరిగా పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండటమే తన ధ్యేయమని నిరూపిస్తూ. దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామంలో ఆమె మహిళా వ్యవసాయ కూలీలతో కలిసి ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. గ్రామంలో పలు అధికారిక కార్యక్రమాలను ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో, మార్గమధ్యంలో పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళా కూలీలను ఎమ్మెల్యే గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి నేరుగా వారి వద్దకు వెళ్లారు. వారి బాగోగులు, యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో పాటే పొలంలోకి దిగి కొంతసేపు స్వయంగా వరి నాట్లు వేస్తూ శ్రమజీవులతో మమేకమయ్యారు. తమ ప్రజాప్రతినిధి నేరుగా తమ వద్దకు వచ్చి, కష్టాన్ని పంచుకోవడం పట్ల మహిళా కూలీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కూలీల శ్రమ వల్లే ప్రతి ఇంటికీ అన్నం చేరుతోందని, వారే ఈ దేశానికి నిజమైన అన్నదాతలని కొనియాడారు. వారి కష్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాల న్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రైతు కూలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ కూలీల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటానని, రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దావేర అనిల్

**దేవరుప్పుల :** దేవరుప్పుల మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా బాధ్య తలు స్వీకరించిన దావేర అనిల్ కుమార్, పాలకుర్తి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నూతన బాధ్యతలు చేపట్టిన దావేర అనిల్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకొని సమష్టిగా పనిచేయాలని సూచించారు. దావేర అనిల్ కుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.



## ట్రాఫిక్ పోలీసులకు మెగా వైద్య శిబిరం

- జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యుల సన్మానం
- ఆరోగ్య పరీక్షల్లో పాల్గొన్న సిబ్బంది

**సికింద్రాబాద్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్–1 కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలో తిరుమల గిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ట్రాఫిక్ పోలీసుల కోసం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎండ, వర్షం వంటి ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ ట్రాఫిక్, తిరుమలగిరి డివిజన్ జి. శంకర్ రాజు మాట్లాడుతూ, ట్రాఫిక్ పోలీసుల విధులు అత్యంత శ్రమతో కూడుకున్నవని, ప్రతి పోలీసు ఉద్యోగి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛందంగా సేవలందించిన శ్రీకర్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ భవాని, పద్మసాయి డెంటల్ క్లినిక్ వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ శ్రేయ, అలాగే రెటినోవా ఫౌండేషన్ (ప్లానెట్ ఆప్టిక్స్)కు చెందిన కె. భరత్ కుమార్లను ఏసీపీ జి. శంకర్ రాజు ఘనంగా సన్మానించి అభినందించారు. వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఆరోగ్య సలహాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన వైద్యులు, వైద్య బృందాలకు పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.



## 52 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 52 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి త్వరితగతిన ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# ఏపీ నుంచి అమలులోకి వీబీజీ రామ్ జీ పథకం

- రైల్వే కోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రామ్ జీ తో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- వీబీ జీ రామ్ జీ పోర్టల్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వీబీ జీ రామ్ జీ పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి హామీ
- పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధుల పత్రం అందజేత



**తిరుపతి, జూలై 02 :** కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజివికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.." వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది. రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశానీ. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు". అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ "కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమ స్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు చేయాలని కూట మి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్

### బ్రహ్మం చౌదరి, గౌతమిల నిశ్చితార్థానికి హాజరు

**తిరుమల, జులై 2 :** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అనంతరం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే. గౌతమి శ్వేత నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, కే. గౌతమి శ్వేతలను మంత్రి లోకేశ్ ఆశీర్వదించారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్న ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలు ఉంగరాలు మార్చుకుని నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివాహానికి ముందు జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. పలువురు టీడీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు కూడా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల జీవితంలో ఈ శుభ ఘట్టం చిరస్మరణీయంగా నిలవాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుంది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

## ఏపీ భవిష్యత్‌ను నాశనం చేయడమే జగన్ లక్ష్యం

- అప్పుడు మూడు రాజధానులు.. ఇప్పుడు మావిగన్
- మతితప్పి మాట్లాడుతున్న జగన్ : సోమిరెడ్డి ఆగ్రహం

**అమరావతి, జులై 2 :** ఏపీ భవిష్యత్తు నాశనం కావాలని జగన్ కంటకణం కట్టుకున్నారని, అందుకే మావిగన్ అంటున్నారంటూ టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు మానవత్వం లేదన్నారు. ఇది విజనరీ, మెంటల్ కేసుకు మధ్య పోటీ అంటూ దుయ్యబట్టారు. మొదట 'అమరావతి' తర్వాత 'మూడు రాజధానులు' ఇప్పుడు 'మావిగన్' అంటూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తీరు అందరికీ తెలుసన్నారు. అమరావతి, మావిగన్‌కు పోటీ అని వైసీపీ అధినేత అంటున్నారని మండిపడ్డారు. జగన్ ఏం చెబుతున్నారో ఆయనకే అర్థంకాని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే అన్నారు. అమరావతిలో వేల కోట్ల పెట్టుబడులు వస్తుంటే... జగన్‌కు మాత్రం విధ్వంస రాజకీయాలే కనిపిస్తున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇస్తున్నామని చెబితే.. ఒక్క వైసీపీ నేతలు మాత్రం బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లారని విరుచుకుపడ్డారు. గత ఎన్నికల్లో 3 రాజధానులంటూ వెళ్తే 11 సీట్లు వచ్చాయని తెలిపారు. రేపు మావిగన్ పేరుతో వెళ్తే ఒకటో, రెండో సీట్లు వస్తాయన్నారు. జగన్‌కు ఏం కావాలో తెలియట్లేదని.. జేబులో గన్, చేతిలో గొడ్డలి కావాలేమో అంటూ వ్యాఖ్యానించారు. రైతుల త్యాగాలతో నిర్మితమైన రాజధానిపై కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. గత ఐదేళ్లు అమరావతి నుంచే పాలన చేసిన జగన్ ఇప్పుడు అదే రాజధానిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రూ.57,821 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న అమరావతిని అడ్డుకోవడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడులు తెస్తుంటే... జగన్ పెట్టుబడిదారులను భయపెట్టే రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాష్ట్ర భవిష్యత్తు.. దాన్ని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలే ఫుల్‌స్టాప్ పెడతారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.



## న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగం

### సుప్రీంకోర్టు సీరియస్

**న్యూఢిల్లీ :** న్యాయ ప్రక్రియలో కృత్రిమ మేధ వినియోగంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ధ్రువీకరించని ఏఐ ఆధారిత సమాచారం న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని అభిప్రాయపడింది. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగాన్ని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధేలతో కూడిన సుప్రీం ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నకిలీ, ఉనికిలో లేని పూర్వ తీర్పులను అందులో ప్రస్తావించారని, ఏఐ టూల్స్ సాయంతో దానిని సృష్టించినట్లు ధర్మాసనం గుర్తించింది. కల్పిత సమాచారాన్ని ప్రస్తావించడం న్యాయ ప్రక్రియకు చాలా హానికరమని పేర్కొన్న సర్వోన్నత న్యాయస్థానం.. ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. సరైన ధ్రువీకరణ లేకుండా రూపొందించే ఈ ఏఐ తీర్పులపై కఠినంగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు సూచించింది.

## కూటమి ప్రభుత్వ విజయపథంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకం

### ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

**దెందులూరు, జూలై 2 :** కూటమి ప్రభుత్వ విజయపథంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని, అలాంటి ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్. గత గొడ్డలి పార్టీ దుర్మార్గపు పాలనను తరిమికొట్టడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పుకొచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, 12వ పీఆర్సీ, 4 డీఏల విడుదల, సరెండర్ లీవ్స్ బకాయిల పరిష్కారంపై ఏలూరు జిల్లా జేఏసీ నేతల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి వినతిపత్రం అందించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్నో ఉన్నా కూడా రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ దిశగా కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, అలాగే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణం, కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు అత్యంత కీలకమైన భాగస్వాములని ప్రశంసించారు. గురువారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నిత్య ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. గత వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగులు, పోలీసులు మరియు ఉపాధ్యాయుల సరెండర్ లీవ్స్ బకాయిలను చెల్లించేలా చూడాలని, ఉద్యోగుల హెల్త్ కార్డుల క్రమబద్ధీకరణతో పాటు పలు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం అండగా నిలవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రంలో పేర్కొన్న పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవ్స్ బకాయిలు మరియు హెల్త్ కార్డుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి సత్వర పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉద్యోగులకు భరోసా ఇచ్చారు.

## మావిగన్ అంటే ఇక సున్నాకే పరిమితం

### జగన్‌ను హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి, జులై 2 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని.. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చిచేష్టలతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొ?న్నారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా.. రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగు తున్నాయని చూసి ఓర్చుకోలేక జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని.. 33000 ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు నీకు బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలూ కష్టపడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

## నేడు కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం

**కర్నూలు, జులై 2 :** రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. అందులో భాగంగానే ఈ నెల 3వ తేదీన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమ బిడ్డ అని పేరు చెప్పుకున్న జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రాంతానికి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో తెదేపా జెండా ఇంకా 30 ఏళ్లు ఎగురుతూనే ఉంటుందని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో కేవలం తెదేపా పాలనలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ కొనసాగుతుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు పింఛన్లను అందజేశామన్నారు.

## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంకై ఈనెల 7న విజయవాడలో భారీ ధర్నా

**ఏలూరు, జులై 2 :** పురపాలక, నగరపాలక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జులై 7వ తేదీన విజయవాడలో జరుగు ధర్నా కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగ, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏఐటియుసి ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. గురువారం ఉదయం స్థానిక ఆర్‌ఆర్ పేట వద్ద మస్తరు సమయంలో ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్ లో శ్రీనివాస్ డాంగే మాట్లాడారు. మరణించిన లేదా ఉద్యోగ విరమణ పొందిన మున్సిపల్ కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు కల్పించాలని డాంగే కోరారు. 11వ పిఆర్సి బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్సి కమిటీని నియమించాలని, 30శాతం ఐ ఆర్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి బకాయి పడ్డ సరెండర్ లీవులు మరియు డిఏలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందిని మరియు ఎన్‌ఎంఆర్ లను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని కోరారు.

## అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా..


### పేలుళ్ల శబ్దాలకు వణికిన ప్రజలు



**ఉక్రెయిన్ :** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. చమురుశుద్ధి కార్మాగారాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేయడంతో రష్యాలో ఇంధన కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిస్పందనగా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై మాస్కో దళాలు విరుచుకుపడ్డాయి. కొన్నిగంటల పాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించాయి. రాజధాని నగరం కీవ్‌లో భారీ పేలుళ్లు వినిపించడంతో ప్రజలు వణికిపోయారు. ఈ దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యా యి. ఈ దాడిలో రష్యా బాలిస్టిక్, క్రూజ్ క్షిపణులు ఉపయో గించింది. దీంతో నిప్రో నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. ఆ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరించడంతో.. పలువురు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఇది భయంకరమైన శత్రుదాడి అని ఉక్రెయిన్ ప్రభుత్వం అభివర్ణించింది. ఇప్పటి వరకు ఒకరు మరణించారని, 11మంది గాయపడ్డారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. కొన్నిరోజులుగా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకుపడటంతో రష్యా ఉక్కిరిబిక్కిరి అయింది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారు చేసే కార్మాగారాలు సహ సైనిక, ఇంధన స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మాస్కోలో బ్లాక్ రెయిన్ కురిసినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడులతో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారు. ప్రస్తుతం బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. పెట్రోల్ ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో అందిస్తోంది. ఈ కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్ దిగుమతి చేసుకుంటోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబాయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. అంతర్జాతీయ పరిస్థితులు సానుకూలంగా మారడం, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. అదేవిధంగా ఐటీ షేర్ల కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 579 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 169 పాయింట్లు పైకి ఎగబాకింది. సెన్సెక్స్ ఉదయం 77,083.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,922.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. 77,578.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 579.48 పాయింట్ల లాభంతో 77,502.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 169.85 పాయింట్ల లాభంతో 24,175.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎల్అండ్‌టీ, మారుతీ, యాక్సిస్‌బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, కోటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.40గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.54 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 4,063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.





# బిజినెస్




## 20 రోజుల్లో క్లెయిమ్ సెటిల్ చేయకుంటే 12% పెనాల్టీ

**న్యూఢిల్లీ:** ఈపీఎఫ్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పీఎఫ్ విత్‌డ్రా, పెన్షన్ ఫిక్సేషన్‌కు కాలపరిమితిని నిర్దేశించింది. ఈపీఎఫ్–1952, ఈపీఎస్–1995, ఈడీఎల్ఐ–1976 స్థానాల్లో సామాజిక భద్రత కోడ్ కింద ఉద్యోగుల భవిష్యనిధి పథకం–2026, ఉద్యోగుల పింఛను పథకం–2026, ఉద్యోగుల డిపాజిట్ బీమా పథకం–2026 తీసుకొస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో ఈ నిబంధనలను పొందుపరిచింది. పీఎఫ్ విత్‌డ్రా, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ నిర్ణయం, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను వేగంగా పూర్తి చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇకపై అర్హత కలిగిన క్లెయిమ్‌లను ఎలాంటి సహేతుక కారణం లేకుండా 20 రోజుల్లోగా పరిష్కరించకపోతే సంబంధిత ఈపీఎఫ్ఓ కమిషనర్‌పై 12 శాతం పెనాల్టీ విధిస్తారు. క్లెయిమ్ మొత్తంపై విధించే వడ్డీ మొత్తాన్ని సదరు అధికారి జీతం నుంచి మినహాయించి.. క్లెయిమ్ చేసిన వ్యక్తికి ఆలస్యానికి పరిహారంగా చెల్లిస్తారు. చెల్లింపుల ఆలస్యానికి పరిహారం చెల్లించే నిబంధన గత పథకాల్లోనూ ఉందని అధికార వర్గాలు తెలిపాయి. గతంలో నిర్ణయించిన వడ్డీ మొత్తాన్ని చెల్లించే నిబంధన ఉండగా.. ఇప్పుడు 12 శాతంగా నిర్ణయించినట్లు తెలిపారు. కోడ్‌ను అనుసరించి కొత్త పథకాలను నోటిఫై చేయడం మినహా ఈపీఎఫ్ఓ, ఈపీఎస్ పథకాలకు సంబంధించిన చెల్లింపుల్లో ఎలాంటి మార్పులూ చేయలేదని పేర్కొన్నారు. అలాగే, ఈపీఎఫ్ఓ సేవలు ఆన్‌లైన్‌లో నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా నిబంధనలను కేంద్రం పొందుపరిచింది. ఎంప్లాయర్లు, ఈపీఎఫ్ఓ కార్యాలయాలు, ఈపీఎఫ్ఓ నుంచి మినహాయింపు పొందిన పీఎఫ్ ట్రస్ట్‌లన్నీ.. క్లెయిమ్‌ల దాఖలు కోసం మెంబర్లకు ఆన్‌లైన్ సదుపాయాలను తప్పనిసరిగా కల్పించాల్సి ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఈపీఎఫ్ నుంచి ఏడాదికి రెండుకన్నా ఎక్కువ పాక్షిక ఉపసంహరణలు చేయకుండా నిబంధనలు కఠినతరం చేసింది.




## ఆగస్టులో శ్రీలంక పర్యటనకు భారత్

ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 సీజన్ నడుస్తోంది. ఆగస్టులో శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు రెండు టెస్టుల సిరీస్‌కు సంబంధించి తేదీలను విడుదల చేసింది. తొలి టెస్టుకు గాలె వేదిక కాగా.. రెండో మ్యాచ్‌కు కొలంబో వేదికగా నిలిచింది. ఉదయం 10 గంటల నుంచి ఆట ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్ పాయింట్ల పట్టికలో భారత్ (48.15 శాతం) ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఇప్పటికి తొమ్మిది టెస్టులు ఆడిన టీమ్‌ఇండియా నాలుగింట్లో గెలిచి.. మరో నాలుగు మ్యాచుల్లో ఓడింది. టాప్–2లో ఉండే టీమ్‌లే ఫైనల్‌కు చేరుకుంటాయి. అలా భారత్ తొలి రెండు స్థానాల్లో నిలవాలంటే మాత్రం ఇప్పట్నుంచి ప్రతి సిరీస్ కీలకమే. శ్రీలంకను తక్కువగా అంచనా వేస్తే బోల్తాపడే ప్రమాదం లేకపోలేదు. 2017 తర్వాత భారత్ టెస్టుల కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. అప్పట్లో విరాట్ సారథ్యంలో భారత్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.



## రంగారెడ్డిపై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం

**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో ఆరంభంలో వరుసగా రెండు ఓటములు చవిచూసిన కరీంనగర్ డైమండ్స్ బలంగా పుంజుకుంటోంది. గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది. వరుసగా మూడో విజయం సాధించిన ఆ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకొచ్చింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో రంగారెడ్డి రైజర్స్ 172/9 స్కోరుకు పరిమితమైంది. ఆదిత్య జవ్వాజి (48; 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలు) టాప్ స్కోరర్. జ్ఞానప్రకాశ్ రెడ్డి (23), ఆరోన్ జార్జ్ (19), నితిన్ సాయి యాదవ్ (15) పరుగులు చేశారు. చివర్లో ఆర్యన్ కరియప్ప (30; 20 బంతుల్లో) దూకుడుగా ఆడినా ప్రయోజనం లేకపోయింది. కరీంనగర్ బౌలర్లలో నారాయణ తేజ 3, రత్లావత్ దినేశ్ 2, శుభమ్ శర్మ 2, ఆశిశ్ శ్రీవాత్సవ, సతీశ్ కుమార్ ఒక్కో పడగొట్టారు. ఐదు మ్యాచ్‌ల్లో రంగారెడ్డికి ఇది రెండో ఓటమి. తొలుత కరీంనగర్ బ్యాటర్లలో రాహుల్ రాదేశ్ (72; 37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలు), ఎఖ సింహ (60; 38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలు) అర్ధ శతకాలతో మెరిశారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 123 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. ఓపెనర్లు సాత్విక్ రెడ్డి (24; 13 బంతుల్లో), తన్మన్ అగర్వాల్ (29; 16 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. చందన్ సహాని (19), శుభమ్ శర్మ (17) పరుగులు చేశారు. రంగారెడ్డి బౌలర్లలో తనయ్ జడ్డా 2, నితిన్ సాయి యాదవ్, తనయ్ త్యాగరాజన్ చెరో వికెట్ తీశారు.

## ప్రమాదమని తెలిసినా
# భారత్ బ్యాటింగ్ తీసుకుంది

**దినేశ్ కార్తిక్**

సాధారణంగా టీ20 క్రికెట్‌లో మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంటే టాస్ గెలిచిన జట్లు తొలుత ఫీల్డింగ్ చేయడానికి మొగ్గుచూపుతాయి. అయితే, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవల ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో టీమ్‌ఇండియా రెండు మ్యాచ్‌ల్లోనూ ఛేజింగ్‌లో విఫలమై ఓడిపోయింది. ఆ సిరీస్ ఓటమి ప్రభావంతో ఇంగ్లాండ్‌తో తొలి టీ20కి వర్షం ముప్పు ఉంటుందని తెలిసినా.. భారత్ ఛేజింగ్‌కు బదులు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని కొత్త ప్రయోగం చేసిందని మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ అభిప్రాయపడ్డాడు. "వాతావరణం ఎప్పుడూ మారుతూనే ఉంటుందన్న విషయం తెలిసినప్పటికీ బ్యాటింగ్ ఎంచుకోవాలన్న భారత్ నిర్ణయం సరైనదే. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా లక్ష్యాన్ని ఛేదించడానికే ఎక్కువ మొగ్గు చూపుతుంటారు. వర్షం ముప్పు పొంచి ఉండటంతో ఇక్కడ వాతావరణం కాస్త విచిత్రంగా, అసౌకర్యంగా అనిపించింది. పైగా ఐర్లాండ్ పర్యటన తాలూకు ప్రభావం కూడా కొంత ఉన్నట్లు నాకు అనిపించింది. అందుకే 'ఛేజింగ్ జోలికి వెళ్లకుండా మొదట బ్యాటింగ్ చేద్దాం' అని భారత్ నిర్ణయించుకుంది" అని దినేశ్ కార్తిక్ పేర్కొన్నాడు. ఐర్లాండ్‌పై విఫలమైన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో 47 బంతుల్లో 68 పరుగులు చేశాడు. ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును అభిషేక్‌తో కలిసి ఆదుకున్నాడు. ఈ క్రమంలో శ్రేయస్ బ్యాటింగ్ గురించి దినేశ్ కార్తిక్ మాట్లాడాడు. "అయ్యర్ తనపై ఉన్న ఒత్తిడిని అధిగమించాలనుకున్నాడు. అందుకే చక్కగా బ్యాటింగ్ చేశాడు. అతను కచ్చితంగా ఒత్తిడిలోనే ఉండి ఉంటాడు. ఎందుకంటే ఒక నాయకుడిగా మాటల్లోనే కాకుండా చేతల్లోనూ ముఖ్యంగా బ్యాటింగ్‌లో తన సత్తా చాటాల్సి ఉంటుంది. ఆ విషయం అతనికి తెలుసు. 'నేనే నాయకుడిని, పరుగులు సాధించే బాధ్యత నాదే' అని ముందుకొచ్చి నిలబడాల్సిన అవసరం కెప్టెన్‌కు ఉంది. అతను ఆ పనిని చాలా చక్కగా నిర్వర్తించాడు" అని డీకే విశ్లేషించాడు. ఇంగ్లాండ్‌తో ఫస్ట్ టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 189/7 స్కోరు చేసింది. అనంతరం భారీ వర్షం మొదలైంది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. రెండో టీ20 శనివారం జరగనుంది.



# రెండో అనధికార టెస్టు..

### తొలి రోజు ముగిసిన ఆట

**గాలె:** శ్రీలంక ఎ, ఇండియా ఎ మధ్య జరుగుతున్న రెండో అనధికార టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక.. ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. ఐదో స్థానంలో వచ్చిన సహన్ అరచ్చిగే (83బి; 148 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ దిశగా సాగుతున్నాడు. సహన్‌తోపాటు చమిక గుణశేఖర (6బి) క్రీజులో ఉన్నాడు. అంజల బండార (42), నువనిదు ఫెర్నాండో (44), పవనత వీరసింహ (39), అషెన్ బండార (34), సోహన్ డి లివెరా (28) పరుగులు చేశారు. ఇండియా ఎ బౌలర్లలో యశ్ ఠాకూర్ 2, సారాంశ్ జైన్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ పడగొట్టారు.



## అలా చేస్తే.. వైభవ్ సూర్యవంశీపై ఇంకా ఒత్తిడి పెరుగుతుంది: గావస్కర్

వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం వాయిదాపడుతూనే ఉంది. తొలుత ఐర్లాండ్‌తో అనుకుంటే.. రెండు టీ20ల్లోనూ అవకాశం కల్పించలేదు. ఇక ఇంగ్లాండ్‌తోనైనా డెబ్యూ చేయిస్తారనుకుంటే.. వర్షం కారణంగా మధ్యలోనే రద్దు అయిన తొలి మ్యాచ్‌కూ ఎంపిక చేయలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తుది జట్టులో స్థానం ఇవ్వకుండా స్క్వాడ్‌లోకి తీసుకోవడం వల్ల ఉపయోగం ఏంటన్న ప్రశ్నలు తలెత్తాయి. అయితే, డ్రెస్సింగ్ రూమ్ అలవాటు పడుతుందనేది మేనేజ్‌మెంట్ సమాధానం. కానీ, మరింత కాలం ఇలానే డగౌట్‌కు పరిమితం చేస్తే వైభవ్‌పై ఒత్తిడి పెరుగుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. "అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసే వైభవ్ సూర్యవంశీపై ఈ వెయిటింగ్ ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. రెండోది లేకపోతే మూడో టీ20లోనైనా అవకాశం వస్తే బాగా ఆడాలని అతడికీ తెలుసు. ఆ క్రమంలో అతడు ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుతం తన చుట్టూ అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నందున వైభవ్ సంతోషంగానే ఉంటాడు. వారి నుంచి చాలా విషయాలను నేర్చుకొనేందుకు ఆస్కారం ఉంది" అని సునీల్ గావస్కర్ వెల్లడించాడు.




### అప్పుడు దంచేసేవాడు: రవిశాస్త్రి

"వైభవ్‌ను ఐర్లాండ్‌పైనే తీసుకొని ఉంటే దంచికొట్టేవాడు. అక్కడన్నీ మందకొడి పిచ్‌లు. ఆ బౌలింగ్‌ను వైభవ్ చిత్తుగా కొట్టేవాడు. కానీ, అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. అతడికి ఛాన్స్ వస్తుందని ఇప్పటికిప్పుడు చెప్పలేను. కానీ, తప్పకుండా అవకాశం ఇచ్చి తుది జట్టులో ఆడించాలి. ఐపీఎల్‌లో అతడు ఎలా ఆడాడో చూశాం. ఏ ఫాస్ట్ బౌలర్‌నూ వదల్లేదు. కానీ, ఇప్పుడు అతడిని బెంచ్‌కే పరిమితం చేశారు. టీమ్‌ఇండియాకు ఎక్స్ ఫ్యాక్టర్. అతడిపై ఇప్పుడేమీ బాధ్యతలు లేవు. జస్ట్ 15 ఏళ్ల కుర్రాడు. భయం లేకుండా ఆడతాడు. తొలి మూడు ఓవర్లలోనే భారీ హిట్టింగ్ చేస్తాడు. ఇలాంటి ఆరంభం వస్తే మిడిలార్డర్ బ్యాటర్లకు పని తేలిక అవుతుంది. అందుకే, అతడికి ఎలాగైనా జట్టులో స్థానం కల్పించాలి" అని మాజీ క్రికెటర్ రవిశాస్త్రి వివరించాడు. ఐర్లాండ్‌తో రెండు టీ20ల్లోనూ ఓపెనర్ సంజు శాంసన్ విఫలమై నిరాశపరిచాడు. ఇక ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్‌లోనూ తేలిపోయాడు. దీంతో సంజు శాంసన్‌ను పక్కన పెట్టి వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనేది అభిమానుల డిమాండ్. కానీ, కెప్టెన్ శ్రేయస్‌తోపాటు మేనేజ్‌మెంట్ మాత్రం సీనియర్ల వైపే మొగ్గు చూపిస్తుండటం గమనార్హం. ఇంగ్లాండ్‌తో రెండో టీ20 శనివారం జరగనుంది.



## పెట్రో ఊరట అప్పుడే కాదు

### కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురీ

**ఢిల్లీ:** ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికీ పెద్ద మొత్తంలో నష్టాలు చవిచూస్తున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. జూన్ 30 వరకు పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విక్రయాలపై రూ.74,781 కోట్ల మేర నష్టం చవిచూసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తుండడం ఇందుకు కారణమన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "పెట్రో ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి రెండు నెలల ముందే ముడి చమురును ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. రెండు నెలల ముందు నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ముడి చమురు ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు చాలా అధికంగా ఉన్నాయి. అమెరికా– ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ముడిచమురు ధరలు దిగొచ్చాయి" అని హర్దీప్ సింగ్ పురి వివరించారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు? అని విలేకరులు ప్రశ్నించగా.. రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు అది సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ పురీ పేర్కొన్నారు.



## 9,500 కోట్ల ఐపీఓకు కోకాకోలా ఇండియన్ యూనిట్

ప్రముఖ శీతలపానీయాల సంస్థ కోకాకోలా.. భారత్‌కు చెందిన తన బాటిలింగ్ యూనిట్ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. మార్కెట్ నుంచి 1 బిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు రూ.9,500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వచ్చే వారం లండన్ వేదికగా ప్రజంటేషన్ ఉండొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కోకాకోలాకు ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఉన్న రోత్స్‌చైల్డ్ అండ్ కో సంస్థ ప్రతిపాదిత ఐపీఓపై బ్యాంకర్లతో సమావేశం కానుంది. ఐపీఓ సైజ్, ఇతర వివరాలపై త్వరలో స్పష్టత రానుంది. దీనిపై కోకాకోలా అధికారికంగా స్పందించలేదు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ భారత అనుబంధ సంస్థలను ఐపీఓకు తీసుకొస్తున్నాయి. ఎల్‌జీ, హ్యుందాయ్ ఇప్పటికే పబ్లిక్ ఇష్యూకు రాగా.. కోకాకోలా కూడా ఈ జాబితాలో చేరనుంది. కోకాకోలాకు భారత్ అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ లిమిటెడ్ విలువ 10 బిలియన్ డాలర్లుగా ఉంది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థకు 12 రాష్ట్రాల్లో 14 తయారీ ప్లాంట్లు ఉన్నాయి. దాదాపు 5,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.



# ఆ చిత్రంలో నాని నటన అద్భుతం..

## పూజా హెగ్డే ప్రశంసలు

క్రేజీ హీరోయిన్ పూజా హెగ్డే ఇప్పటికే పలువురు టాలీవుడ్ స్టార్ హీరోలతో కలిసి నటించి ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకుంది. తెలుగు చిత్రాల్లో మంచి క్రేజ్ సంపాదించుకున్న సమయంలోనే తమిళం, హిందీ చిత్రాలపై కూడా దృష్టి సారించింది. ఇక తాజాగా ఓ టాలీవుడ్ హీరో నటనపై ఆమె ప్రశంసల వర్షం కురిపించింది. పూజా హెగ్డే మాట్లాడుతూ.. "నాని హీరోగా నటించిన 'నిన్ను కోరి' సినిమా నాకు చాలా ఇష్టం. ఆ చిత్రంలో నాని నటన అద్భుతంగా ఉంటుంది. ముఖ్యంగా ఆయన నటన నన్నెంతో ఆకట్టుకుంది" అని తెలిపింది. ఇప్పటివరకు పూజా హెగ్డే పలువురు టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించినప్పటికీ, నానితో మాత్రం ఒక్క సినిమా కూడా చేయలేదు. దీంతో నాని నటనను ఇంతగా ప్రశంసించడంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వచ్చే అవకాశాలపై ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తుండగా, త్వరలోనే 'బ్లడీ రోమియో' సినిమాను ప్రారంభించనున్నాడు. మరోవైపు పూజా హెగ్డే వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నప్పటికీ ఇటీవల కాలంలో ఆమెకు ఆశించిన స్థాయి విజయం మాత్రం దక్కలేదు.

# ధృవ్ విక్రమ్‌తో మైత్రీ మూవీస్ చిత్రం ప్రారంభం

ఇటీవల బైసన్‌తో మెప్పించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు, యువ సంచలనం ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఒక సరికొత్త చిత్రాన్ని ప్రకటించింది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ భారీ చిత్రం చెన్నైలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే ఇప్పటివరకు రాని ఒక డిఫరెంట్ జోనర్‌లో, అవుట్ అండ్ అవుట్ పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్ కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రైటర్ శబీ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రిప్ట్‌ను మరియు డైలాగ్స్‌ను అందిస్తున్నారు. కేవలం కథానాయకుడి పాత్రే కాకుండా సినిమాలో మిగిలిన పాత్రలు కూడా చాలా బలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలోనే చిత్రంలో కీలక పాత్రల కోసం ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ మరియు యాక్టర్ సాయి దీనలను ఎంపిక చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. విక్కీ సినిమాటోగ్రాఫర్‌గా విజువల్స్ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇందులో హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ డిజైన్ చేయడం కోసం ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ వి.ఎమ్. మోర్‌ను రంగంలోకి దించారు. ఈ పూజా కార్యక్రమాలతోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి తారాగణం, హీరోయిన్ మరియు టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా వెల్లడిస్తారని సమాచారం.




# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ





దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



# నేడు థియేటర్లలోకి నాగబంధం మూవీ


## హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్

పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషబ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.




# సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్బే దయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# 35 సినిమాల ద్వారా రాని క్రేజ్‌ను ఆ ఒక్క మూవీ తీసుకొచ్చింది

యంగ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఇప్పటివరకు ప్రధానంగా తమిళ, తెలుగు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. తాజాగా ఐశ్వర్య రాజేష్ 'ఇసకపట్నం' అనే వెబ్ సిరీస్‌లో కీలక పాత్ర పోషించింది. ఈ వెబ్ సిరీస్ ఈరోజు నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. ఇక తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య రాజేష్‌కు, "మీరు కెరీర్ ప్రారంభించి చాలా కాలమైంది. ఇప్పటివరకు ఎన్నో సినిమాల్లో నటించారు. అయితే మీకు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతోనే భారీ గుర్తింపు వచ్చిందని చాలామంది భావిస్తున్నారు. మీరు కూడా అదే అనుకుంటున్నారా?" అనే ప్రశ్న ఎదురైంది. దానికి ఐశ్వర్య రాజేష్ స్పందిస్తూ.. "నేను ఇప్పటివరకు దాదాపు 35 సినిమాల్లో నటించాను. ఆ 35 సినిమాల ద్వారా రాని క్రేజ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చింది. ఆ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే అందులో నేను పోషించిన పాత్ర చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు అందరికీ బాగా కనెక్ట్ అయింది. అలాంటి పాత్ర దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా కెరీర్‌లో అది ఎప్పటికీ చాలా ప్రత్యేకమైన పాత్రగా నిలిచిపోతుంది" అని చెప్పుకొచ్చింది. ఇక ఐశ్వర్య రాజేష్ తాజాగా తిరువీరు హీరోగా నటిస్తున్న 'ఓ..! సుకుమారి' చిత్రంలో కథానాయికగా నటించింది. ఈ సినిమా జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com